

జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ పెండింగ్ బకాయిలపై సమీక్ష చేస్తున్న కలెక్టర్ శరత్

# బకాయిలు చెల్లించాలి

- 15 రోజుల్లో బకాయిలు చెల్లించాలి
- 'ట్రైడెంట్' చక్కెర పరిశ్రమకు హెచ్చరిక
- రైతులకు డబ్బులు చెల్లించకుంటే పరిశ్రమ ఆస్తులను వేలం వేస్తాం
- సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదేశం

జహీరాబాద్, నవంబర్ 4 : ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యం చెరుకు రైతులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, లేకుంటే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం ఫ్యాక్టరీ ఆస్తులను వేలం వేస్తామని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్ హెచ్చరించారు. శనివారం జహీరాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో చెరుకు రైతుల పెండింగ్ బకాయిలపై సమీక్ష నిర్వహించారు. ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యం చెరుకు రైతులకు రూ. 9.10 కోట్లు చెల్లించాల్సి ఉన్నదన్నారు. పెండింగ్ బకాయిల కోసం జహీరాబాద్ తహసీల్దార్ ఫాం -5ను ఫ్యాక్టరీ యాజమాన్యానికి అందజేశారని తెలిపారు. గడువులోగా డబ్బులు చెల్లించకపోతే ఆస్తులను వేలం చేసి రైతులకు డబ్బులు చెల్లిస్తామన్నారు. సకాలంలో డబ్బులు చెల్లించకపోతే క్రిమిల్ కేసు నమోదు చేస్తామన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యానికి 15 రోజులు గడవు ఇస్తున్నట్లు, గడువులోగా డబ్బులు చెల్లించకపోతే ఆస్తులను వేలం వేస్తామని హెచ్చరించారు. సమావేశంలో షుగర్ కేన్ జిల్లా కమిషన్ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ సుభాశ్‌రావు, రూరల్ ఎస్సై ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

# రెండో రోజు.. 'ఆరు'

- సంగారెడ్డి జిల్లాలో కొనసాగుతున్న నామినేషన్లు
- జహీరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ దాఖలు

సంగారెడ్డి, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. శనివారం ఆరు నామినేషన్లు దాఖలు అయ్యాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో మూడు, అందోలు నియోజకవర్గంలో రెండు, జహీరాబాద్ నియోజకవర్గంలో ఒక నామినేషన్ దాఖలైంది. సంగారెడ్డి, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో రెండో రోజు నామినేషన్లు దాఖలు కాలేదు. అందోలు నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా బేగరి ఆమోస్, బక్క కృష్ణ నామినేషన్లు వేశారు. జహీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ నామినేషన్ దాఖలు చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా గానాపురం వేణుగోపాల్, వరికుప్పల యాదగిరి, సోషలిస్టు యూనిటి సెంటర్ ఆఫ్ ఇండియా(కమ్యూనిస్టు) పార్టీ నుంచి పాలాడి దేవయ్య నామినేషన్ దాఖలు చేశారు.

**పటాన్‌చెరులో మూడు నామినేషన్లు**

పటాన్‌చెరు/ జహీరాబాద్, నవంబర్ 4 : పటాన్‌చెరులో రెండోరోజు మూడు నామినేషన్లు నమోదయ్యాయి. పట్టణంలోని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ దేవుజా కార్యాలయంలో ఘనపురానికి చెందిన వేణు స్వతంత్ర అభ్యర్థిగా, దేవయ్య పాలాడి ఎస్‌యూసీఐ(సీ) అభ్యర్థిగా, స్వతంత్ర అభ్యర్థిగా వరికుప్పల యాదగిరి నామినేషన్లు వేశారు. పటాన్‌చెరులో ఇప్పటివరకు మొత్తంగా నాలుగు నామినేషన్లు వచ్చాయి.

**'అక్రిడిటేషన్' విలేకరులకే అనుమతి**

అక్రిడిటేషన్ గుర్తింపుకార్డు ఉన్న విలేకరులకు మాత్రమే ఎన్నికల సంఘం గుర్తింపు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన అక్రిడిటేషన్ గుర్తింపుకార్డు ఉన్నవారినే మీడియా పాయింట్‌కు పంపిస్తున్నారు. డీపీఆర్‌వో విడుదల చేసిన లిస్టు ప్రకారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అనుమతి ఇస్తున్నామని నోడల్ ఆఫీసర్, మీడియా కమ్యూనికేషన్ అధికారి బన్సీలాల్ తెలిపారు.

**కాంగ్రెస్ అభ్యర్థిగా చంద్రశేఖర్ నామినేషన్..**

జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ చంద్రశేఖర్ నామినేషన్ దాఖలు చేశారు. జహీరాబాద్ పట్టణంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చంద్రశేఖర్ తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డికి అందజేశారు.

# అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల అధికారులు జాగ్రత్తగా ఉండాలి
- అత్యవసర శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్
- ఫారం -12డీని 7వ తేదీలోగా అందజేయాలి
- సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి శరత్
- జహీరాబాద్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఏర్పాట్లు పరిశీలన

సంగారెడ్డి కలెక్టరేట్/ జహీరాబాద్, నవంబర్ 4 : శాసన సభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో అత్యవసర సేవల విభాగాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించినట్లు సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అత్యవసర సేవల విభాగాల్లో ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, విద్యుత్‌శాఖ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, ఆర్టీసీ, ఆహారం, పౌర సేవలు, బీఎస్ఎన్ఎల్, ఈసీఐ ద్వారా అథారిటీ లేఖలు పొందిన మీడియా వ్యక్తులు, అగ్నిమాపకశాఖలో పని చేస్తున్నవారికి ఓటు వేయడానికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. అత్యవసర విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఓటు హక్కును ప్రత్యక్షంగా వినియోగించుకోలేని సమయంలో సంబంధిత సంస్థ నియమించిన నోడల్ అధికారికి లేదా స్థానిక రిటర్నింగ్ అధికారికి పూర్తి వివరాలతో ఫారం -12డీ ఇవ్వాలని సూచించారు. ఆయా దరఖాస్తులను నోడల్ అధికారి పరిశీలించి ధృవీకరించిన తర్వాత స్థానిక నియోజకవర్గం రిటర్నింగ్ అధికారికి ఈ నెల 7లోగా అందజేయాలన్నారు. దరఖాస్తు ఫారం-12డీ నోడల్ అధికారుల నుంచి లేదా సీఈవో తెలంగాణ, ఈసీఐ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు. ఉద్యోగులకు కేటాయించిన ఓటింగ్ కేంద్రాలు, సమయ వివరాలను దరఖాస్తుదారులకు ఎస్ఎంఎస్ లేదా బూత్‌స్థాయి అధికారుల ద్వారా తెలియజేస్తామని పేర్కొన్నారు. అత్యవసర సేవల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నవారు పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే అవకాశం ఉండదన్నారు. పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని అత్యవసర శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.



జహీరాబాద్ : ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి శరత్




జహీరాబాద్ : మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి శరత్

## ఎక్కడా సమస్యలు రావద్దు

రిటర్నింగ్ కార్యాలయాల్లో నామినేషన్ స్వీకరణ కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్ తెలిపారు. జహీరాబాద్ పట్టణంలోని ఆర్డీవో (ఎన్నికల రిటర్నింగ్) కార్యాలయంలో ఏర్పాట్లును పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలన్నారు. ఎక్కడా సమస్య ఉన్న వెంటనే పరిష్కరించాలని ఆధికారులను ఆదేశించారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులు నిలిచి ఉండేందుకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించామన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డి, తహసీల్దార్ రవీందర్, మున్సిపల్ కమిషనర్ సుభాశ్‌రావు, ఎన్నికల అధికారులు ఉన్నారు.

# పోలీసులు సమాచారాన్ని పంచుకోవాలి

- సమాచారం అడిగిన వెంటనే స్పందించాలి
- పోలీసులందరూ సమయపాలన పాటించాలి
- అధికారులు, సిబ్బందితో ఎస్పీ రూపేశ్ సమీక్ష

సంగారెడ్డి, నవంబర్ 4 : పోలీసు అధికారులు, సిబ్బంది సమాచారాన్ని పంచుకుని పని భారం తగ్గించుకోవాలని, ఇందుకోసం పూర్తి చేసిన పని సమాచారాన్ని ఇతరులకు వెంటనే ఇచ్చేందుకు స్పందించాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ సూచించారు. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో శనివారం ఎస్పీ రూపేశ్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ముఖ్యంగా డీపీవో, డీసీఆర్‌బీ, ఐటీ సెల్, పోలీసు కంట్రోల్ రూమ్, కమ్యూనికేషన్స్, తదితర శాఖల అధికారులు, సిబ్బందితో ఎన్నికల నిర్వహణపై సూచనలు చేశారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ఎవరికి కేటాయించిన పనులు వారు సక్రమంగా నిర్వర్తిస్తూ పనులు పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం చూపొద్దని, పోలీసు సిబ్బంది విధినిర్వహణలో సుదూర ప్రాంతాల్లో ఉంటారని, వారికి సంబంధించి ఎలాంటి బిల్లులు, ఇంక్రిమెంట్ ఇతర పనులు పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది ఎప్పటి పనిని అప్పుడే పూర్తి చేస్తూ పని భారాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ఎలాంటి సమాచారం అడిగిన వెంటనే స్పందించే విధంగా పోలీసు యంత్రాంగం పని చేయాలన్నారు. అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉన్నదని, సిబ్బంది ప్రతి విషయంపై అవగాహన పెంచుకుని నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. కంప్యూటర్‌పై పట్టు సాధించి, టైపు రైటింగ్‌లో నైపుణ్యత కలిగి ఉండాలన్నారు. సమావేశంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి కల్యాణి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, కమ్యూనికేషన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, డీపీవో పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వివిధ శాఖల పోలీసు అధికారులు, సిబ్బంది



మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

# బీజేపీ ప్రచారంలో అపశృతి

- ప్రచార రథం ఢీకొని వృద్ధురాలికి గాయాలు
- జిన్నారంలో వాహన డ్రైవర్‌పై కేసు నమోదు

జిన్నారం, నవంబర్ 4 : బీజేపీ ప్రచార రథం వాహనం ఢీకొని వృద్ధురాలు తీవ్రంగా గాయపడి ఐసీయూలో చికిత్స పొందుతోంది. గాయపడిన వృద్ధురాలు డప్పు నర్సమ్మ మనమడు రాము ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయరావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు... జిన్నారం మండల కేంద్రానికి చెందిన డప్పు నర్సమ్మ (80) గ్రామంలోని వ్యవసాయ కార్యాలయంలో హౌస్‌కీపింగ్‌గా అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నది. శనివారం ఉదయం 11:30 ప్రాంతంలో ఇంటి నుంచి వ్యవసాయ కార్యాలయానికి వెళ్తుండగా బీజేపీ కార్యాలయం వద్ద ఉన్న ప్రచార రథం(టీఎస్15 యూసీ 0012) ఓపెన్ టాప్ జీపు రివర్స్ తీస్తూ నర్సమ్మను ఢీకొట్టింది. దీంతో నర్సమ్మ కింద పడడంతో ఎడమ, కుడి చేతులు, కుడి కణతకు గాయాలయ్యాయి. గాయపడిన వృద్ధురాలిని సురారం మల్లారెడ్డి దవాఖానకు తరలించగా, ఐసీయూలో చికిత్స పొందుతున్నది. వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపిన మెదక్ జిల్లా శంకరంపేట మండలం శివాయపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ చిన్నకట్ట మొగులయ్యపై నర్సమ్మ మనుమడు రాము ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయరావు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600. NT-320535

★ CIVIL Site Engineer with Experience 5 years. Job Location: Chanda Nagar. Contact: +91 9912990546. NT-322737

★ *హైదరాబాద్* నందు వృద్ధులను *వారి ఇంట్లోనే ఉండి* చూసుకోవడానికి వర్కర్స్ కావలెను. ఉచిత వసతి, భోజనం. జీ: 15-25 వేలు, ఏజెంట్ కమీషన్: 3-5 వేలు, M/F, 20-50 సం||లు. *హేమ హోమ్ హెల్త్‌కేర్*-7330746999. NT-320244-All

**KIDNEY STONES**

★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్ లేని హోమియో పరిష్కారం. 47 సం||, అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. Ph: 9866007924, 9550336677, 040-27000580. NT-320707

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657